# రంగు రంగుల చీకటి

కౌకా హోటల్ పెరటి గోడమీద వాలిన కాకి, కత్తులు సానబెడుతున్నట్లుగా కుత్తుక చించుకుంటోంది, బెత్తెడు కడుపుకోసం!

బస్టాండు ముందర కొళాయి దగ్గర నిలబడి ఇటుక రాతి పొడితో పళ్ళు తోముకుంటూ, రాత్రికి రాత్రి గోడమీద వెలసిన సినిమా పోస్టరుకేసి చూస్తున్నాడు రాములు.

గర్భస్థ శిశువు మాట్లాడుతున్నట్లుగా, కంటికి కనిపించని కంఠమేదో దూరంగా ఎక్కడో మేడల చాటునుంచీ గాలి రథాన్ని అధిరోహించి నేలనూ నింగినీ ముట్టడిస్తోంది.... "నేడే ప్రారంభం! రోజూ మూడు ఆటలు. మేట్నీ మధ్యాహ్నం రెండున్నర గంటలకు! మొదటి ఆట సాయంకాలం ఆరున్నరకు! రెండవ ఆట రాత్రి పది గంటలకు!....."

రాములు చూపులు వాల్ పోస్టరు మీదనే వేలాడుతున్నాయి, మేకులు దిగవేసినట్లు! తెలుగు లిపిలోని తక్కిన అక్షరాలన్నీ అసూయపడేటంత పెద్ద సైజులో సినిమాపేరు! వేశ్యావాటికలో అడుగిడిన రాచబిడ్డను గుమ్మంలో నిలవేసి, అమ్మాయి అంద చందాలను ఏకరువు పెట్టే వేశ్యమాతలా, మరో మాట కూడా చెబుతోంది పోస్టర్ : 'కలర్'!

తెరమీద రంగులెలా వుంటాయో ఊహించుకుంటూ తల పైకెత్తాడు రాములు. బస్టాండుకు తూర్పున, తాటాకు పాకలకు అవతల, నీలికొండలకు బారెడెత్తు న నిలిచి, సూర్యుడు రంగులు కుమ్మరిస్తున్నాడు. కుంచెలు చేత బట్టుకున్న నీరెండ సృష్టి సౌందర్యాన్ని ఆవిష్కరిస్తున్నది. ఆ కాంతి పుంజానికీ ఈ కంటి పాపకూ నడుమ అలౌకిక సౌందర్య సేతువులా - నింగీ నేలా, చెట్టూచేమా, కొళాయి నీళ్ల దూకుడులోంచి ఎగిరిపడుతూన్న తుంపర, బస్సుకోసం వేచివున్న పడుచుదాని

తలలో పువ్వులు, పెదవులపైన నవ్వులు, బంగారం కరిగించి పులుముకున్నట్లున్న నుదుట కుంకుమ బొట్టు, ఉల్లీ ఉల్లీ చీరలోంచి కనిపిస్తోన్న పావడ, పావడ కుచ్చిళ్ళ దిగువ దాగుడుమూత లాడుతున్న పాదాలు.... ఎన్నెన్ని చిత్రవర్ణాలు! వర్ణ సంకరంలో ఎన్నెన్ని కొత్త రంగులు! ఈ రంగులన్నిటికీ ముస్తాబు చేస్తే ఎలా వుంటుందో తెలుసుకోవాలంటే, సినిమా తెరమీద చూడాల్సిందే!

నోరు పుక్కిలించుకుని, భుజం మీది చింకి తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ కాకా హొటల్‌లోకి ప్రవేశించబోయిన రాములు, ఆగి, వెనక్కి తిరిగి చూశాడు. లౌడ్‌స్పీకర్లను, పోస్టర్లు అంటించిన తడికలను నెత్తికెత్తుకుని, ఒంటినిండా మామిడాకుల్నీ, రంగు తోరణాల్నీ సింగారించుకున్న రెండెడ్ల బండి కొత్త సినిమాను గురించిన వ్యాఖ్యానంతో బస్టాండు ముందరికి వచ్చి ఆగింది, రాజుగారి పడకటింట్లో నుంచి జన బాహుళ్యంలోకి వొచ్చేసిన ఆస్థాన నర్తకిలా!

హొటల్‌లోకి వెళ్ళి, రోడ్డు మీద ఆగిన సినిమా బండికి అభిముఖంగా బెంచిమీద కూర్చుని, టీ పట్టుకు రమ్మన్నాడు రాములు.

అది, సంతరోజు!

తిరుపతి బ్రహ్మోత్సవాలుగానీ, పూరీ జగన్నాథ రథోత్సవంగానీ రంగం పేటలో జరగవు. అయితే రంగంపేట విశ్వరూపం దాల్చటాన్ని సంతరోజే చూడగలం. గాజు పట్టకంలోంచి చొచ్చుకు పోయిన ధవళకాంతి వర్ణమాలగా రూపాంతరం పొందినట్లు, సంతరోజున రంగంపేట రంగ రంగ వైభోగంగా దర్శనమిస్తుంది. సినిమా బండి మామూలు కంటే మరికొంత ఎక్కువ మోతాదులో సింగారించుకుని, పదహారు వేలమంది గోపికల్ని చాటు చేసుకుని కృష్ణుడితో దాగుడుమూతలాడే రాధలా, సంతగోలలో అడుగడుగునా అడ్డుపడుతూ ఉంటుంది.

రాముల్ని రంగంపేటలో అన్నిటికంటే ఎక్కువగా ఆకర్షించింది, సంత. సంత కంటే ఎక్కువగా ఆకర్షించింది, సినిమా బండి. సినిమాబండి కంటేమిక్కుటంగా ఆకర్షించింది కూడా ఒకటుంది. చారల పైజామా, చారల చొక్కా తొడుక్కున్న వాడొకడు ఆ బండిలో కాస్త వెనకగా కూర్చుని, చేతిలో మైకు పట్టుకుని, ఊళ్ళో ఆడుతున్న సినిమా ను గురించి చెప్పవలసినవన్నీ ఏకరువు పెడుతుంటాడు. సినిమా చూడటం అన్న వ్యసనానికిలోనై సాక్షాత్తూ సుమతీశతక కారుడే అలా వచ్చి కూర్చుని జనావళికి సందేశం యిస్తున్నాడా అనిపిస్తుంది. వాడి వ్యాఖ్యానమూ, జనాదరణ పొందిన సినిమా పాటలూ ఒకదాని తర్వాత ఒకటి వినబడుతుంటాయి. వాడి వ్యాఖ్యానంకంటే సినిమా పాట బాగుందో,

సినిమా పాట కంటే వాడి వ్యాఖ్యానం బాగుందో చెప్పటం అంత తేలికైన పనేమీకాదు. రాముల్ని రంగంపేటలో అన్నిటికంటే మిన్నగా ఆకర్షించింది, ఆ చారలచొక్కా వాడి అనౌన్స్‌మెంటే!

రాములు టీ తాగి, తనవద్దవున్న ఒకే ఒక పావలా బిళ్ళను హోటల్ యజమానికిచ్చి, వాడు తిరిగి యిచ్చిన పదిపైసల నాణెం జేబులో వేసుకుని, రోడ్డుమీదికి వచ్చాడు. కథానాయకుడు నటించిన రెండువందలా పై చిలుకు చిత్రాల పేర్లలోంచి చాలా వాటిని కథానాయకుడికి విశేషణాలుగా వాడు కుంటూ, అతని బిరుదాలు వల్లిస్తూ, చూచి తీరవలసిన చిత్రం అంటూ సెలవిస్తున్నాడు, చారల చొక్కావాడు. వాడి మాటల వేగానికి ఉపమానం లేదు. వ్యాసుడు చెబుతుంటే మహాభారతాన్ని గరగరా రాసెయ్యగలిగిన గణపతి, చారల చొక్కావాడి దగ్గర బిక్కమొహం వెయ్యాల్సిందే!

ఎక్స్‌ప్రెస్ బస్సు ఒకటి స్టాండు ముందర ఆగుతుండటం చూసి, అర్జునుడి బాణం పోటుకు పైకి ఉబికిన పాతాళ జలధారలా, ఉన్నచోటునుంచి ఎగిరివెళ్ళి బస్సు దగ్గర వాలాడు రాములు. మ్యూజికల్ ఛేర్స్ పందెంలో ఏదో ఒక కుర్చీని దొరకబుచ్చుకోవాలన్న పట్టుదలను కళ్ళల్లో నింపుకుని పరుగెత్తే ఆటగత్తెలా, వాడు బస్సుచుట్టూ గింగుర్లు తిరిగాడు. "కూలీసార్, కూలీ కూలీ! కూలీ బాబూ కూలీ!"

విసిరిన బంతి గోడకు తగిలి తిరిగి వచ్చినంత వ్యవధిలోనే, బస్సు ఆగింది; మళ్ళీ ముందుకు వెళ్ళిపోయింది. బస్సులోంచి దిగిన వాళ్లు యిద్దరే! ఒకడు ఉత్తచేతులతో దిగాడు. మరొకడు, వీధి నాటకంలో చేతిరుమాలు వూపుకుంటూ రంగంమీదికి వచ్చే రాజపాత్రధారిలా, చిన్న బ్రీఫ్‌కేస్‌ను తేలికగా వూపుకుంటూ నడిచిపోయాడు.

రాములు పాలిటి వర్తమానకాలం, మచ్చుకు ఒక్క వాహనమైనా లేని బస్టాండులా ఖాళీగా ఉంది. ఏ బస్సు ఏ వేళకు వస్తుందో తెలియని అనిశ్చిత స్థితిలాంటిది వాడి భవిష్యత్తు. ఇక వాడి ఇరవై ఏళ్ళ గతంతో ఈ కథకు సంబంధం లేదు. రోడ్డునపడ్డ చిత్తుకాగితానికి స్థిరనిశ్చలత వుండదు. అది గాలివీచినవేపు కొట్టుకుపోతూ వుంటుంది. ఏ రాయో రప్పో అడ్డు తగిలినప్పుడు, అక్కడ కొంత సేపు ఆగుతుంది. మళ్ళీ ఏ గాలివాటుకో అక్కణ్ణుంచి కదిలి, మరెక్కడికో ప్రయాణమౌతుంది. చిత్తు కాగితంలాంటి రాములు రంగంపేటకు వచ్చి పది రోజులైంది.

## 3

వాడి రెక్కల కష్టం మీద ఆధారపడి వుంటున్నవాళ్ళు ఎవరూ లేరు, వాడి కడుపుతప్ప! ప్రపంచంలో, తిండికీ ప్రాణానికీ వున్న బాంధవ్యం తరవాతనే, మరి ఏ యితర బాంధవ్యమైనా! తిండి లేకపోతే ప్రాణం నిలవదు. ప్రాణం లేకపోతే తిండికి విలువలేదు. ఒంటిమీద అంతో యింతో కండలున్నాయి గనుక, రంగంపేటలో తిండి సంపాదించుకోవటం పెద్ద సమస్యగా కనిపించలేదు రాములుకు. రంగం పేటలో రైల్వేప్లాట్ ఫారమూ, బస్సు షెల్టరూ ఉన్నవి-వాడు పడుకుని నిద్రపోవటం కోసమే!

షార్ట్‌రూట్ బస్సులు రెండుమూడు వచ్చి వెళ్ళాయి. హొటళ్ళలో కాఫీ తాగి వెళదామని వచ్చినట్టున్నారు ప్రయాణీకులు! కాకపోతే, కూలీ ఎందుకు దొరకదు?

కాళ్ళీడ్చుకుంటూ బజార్న పడ్డాడు రాములు. దుకాణాలన్నీ ఆకలితో నోళ్ళు తెరిచేశాయి. బస్టాండు నుంచీ, రైల్వేస్టేషనుకు మూడు ఫర్లాంగుల దూరం వుంటుంది. అంతదూరమూ, కుడి ఎడమలలో వున్న గోడలన్నీ ఇటుకతోనూ సున్నంతోనూ కట్టినట్లు కాక, సినిమా పోస్టర్లతోనే కట్టినట్లున్నాయి.

రాములు రైల్వే ఓవర్ బ్రిడ్జీ దగ్గర ఆగాడు. బ్రిడ్జీ ఎదుట ఎత్తైన కర్రలు పాతి, వాటి చివర సినిమా హీరోను కట్టేశారు. మెడలో పెద్ద పూలదండ వేలాడుతోంది, చచ్చిన కొండచిలువలా! ఆ బరువుకు హీరో మెడకాస్త పక్కకు ఒరిగిపోయింది.

పక్కనేవున్న పూలదుకాణం, అప్పుడే తాడు తెంచేసిన దౌర్భాగ్యురాలిలా వుంది. పువ్వులు పెట్టుకునే హక్కుగల పూబోణి ఒకతె "పావలా పువ్వులియ్యి కిష్టయ్యా!" అని అడుగుతుంటే, "పువ్వుల కోసమే మనిషిని పంపాను. ఉన్న పువ్వులన్నీ అభిమాన సంఘం వాళ్ళు పట్టుకుపోయారు," అంటున్నాడు దుకాణంవాడు.

తాపసి వెంటబడే ఊర్వశిలా, రాముల్ని వెతుక్కుంటూ వొచ్చేసింది సినిమాబండి. మూడురోడ్ల కూడలిలో నిలబడి, సమ్మోహనాస్త్రాలు ప్రయోగి స్తోంది. కరపత్రాలు కురుస్తుంటే, జనం వాటిని బిస్కత్తుల్లాగా అందుకుంటు న్నారు. చారల చొక్కావాడు వీనుల విందు గొలిపే కంఠంతో, కథలోని ముఖ్య సన్నివేశాల్ని వివరిస్తూ, నాయకీ నాయకుల యుగళగీతాల్లోని పల్లవి పాడుతూ, ఏఏ పాటలు ఏఏ సుందర ప్రదేశాల్లో చిత్రింపబడ్డాయో చెబుతూ జనానికి మత్తెక్కిస్తున్నాడు.

బండి మళ్లీ కదిలింది. చుట్టుపక్కల పల్లెలవెంట తిరిగి రావటానికి కాబోలు, ఊరుదాటి వెళ్ళిపోయింది. పల్లెటూళ్ళ వాళ్ళు ఒకవేళ సంతకు రావటానికి బద్ధకిస్తే, సినిమా కోసమైనా రంగంపేటకు వస్తారని థియేటరు వాళ్ళ అంచనా!

రాములు మళ్ళీ బస్టాండుకేసి నడిచాడు. నడుస్తూ నడుస్తూ, మేట్నీకి వెళ్ళి తీరాలనుకున్నాడు. కథానాయిక సొంపుసోయగాలు, ఆమెతో కథానాయకుడి పచ్చి సరసాలు, పదహారేళ్ళ లేత కండలతో విందు భోజనం వడ్డించే క్లబ్ డ్యాన్సు, హాస్యనటులు గురి తప్పకుండా వదిలే బూతుబాణాలు–వీటినంతా అతి చౌకధరకే అందుకోవచ్చు. అతి సామాన్యుడైనా సరే, ప్రేక్షకుడు ఆయా రసవత్తర సన్నివేశాలలో తెరమీది పాత్రలతో తాదాత్మ్యం చెంది, ఇంద్రియ సుఖంలోని ఉచ్ఛస్థితిని సిద్ధింప చేసుకోవచ్చు. టిక్కెట్లు మామూలే - బెంచీ యాభై అయిదు పైసలు. సెకండ్ క్లాస్ రూపాయీ ఒకపైసా, ఫస్ట్‌క్లాస్ రూపాయీ ఇరవై ఎనిమిది పైసలు!

జేబులో వున్నది పదిపైసలే! క్రితంరోజు, లారీలోనుంచి సిమెంటు బస్తాలు దింపినందుకు ముట్టిన కూలిడబ్బులతో కలిపి మొత్తం నాలుగు రూపాయలు సంపాదించాడు. కానీ, రాత్రి దీపస్తంభం కింద కూర్చుని పులీమేకా ఆట ఆడి ఆ డబ్బు పోగొట్టుకున్నాడు. మధ్యాహ్నానికల్లా ఒకటో అరో సంపాదించలేకపోతానా అన్న ధీమా మాత్రమే యిప్పుడు వాడికి మిగిలింది.

అదేమి ఖర్మమో, ఆ రోజు డబ్బు కళ్ళజూడటమన్నది–స్వర్గలోకానికి వెళ్ళి సౌగంధిక పుష్పాన్ని సంపాదించటమంత కష్టమైపోయింది రాములుకు. స్టాండులోకి బస్సు రాగానే, తనలాంటి కూలీలంతా కాట్లకుక్కలై పోతున్నారు. మధ్యాహ్నం రంగంపేట మీదుగా వెళ్ళే రైళ్లు రెండున్నాయి కానీ, లైసెన్సు కూలీలు తనను స్టేషనులోకి రానివ్వరు. బజార్లవెంట, మండీల వెంట రెండుసార్లు తిరిగాడు. గిరాకీ తగల్లేదు. వాచీ కట్టుకున్న వాడెవడైనా కంటబడితే చాలు, టైం అడిగి తెలుసుకుంటున్నాడు రాములు. నిమిషాలూ గంటలూ లెక్కబెట్టు కుంటున్నాడు. అయితే కాలం వాడిమీద జాలి చూపనూలేదు, వాడికోసం ఆగనూలేదు.

ఆ సమయంలో మగవాడి స్పర్శ ఎరుగని ఏ కన్నెపిల్లయినా వాణ్ణి వలచి, వద్దకువచ్చి 'నీకోసం ఏం చెయ్యమన్నా చేస్తాను. నీ పాత పంట్లాం ఉతికిపెట్ట మంటావా, నీ చిరుగుల చొక్కా కుట్టి పెట్టమంటావా, నీ జీబురుతలకు నూనె రాసి, పేలు కుక్కమంటావా?" అని అడిగితే, 'నీ దగ్గిర అర్ధరూపాయి వుంటే యివ్వు!' అని మాత్రమే కోరుకుంటాడు రాములు.

ఏ కన్నెపిల్లా వాణ్ణి అలా అడగనూ లేదు, ఏ దేవతా దిగి రానూలేదు. కానీ, మధ్యాహ్నం రెండు గంటలయ్యే సరికి వాడి కోరిక మాత్రం నెరవేరింది. బస్సు టాపు మీది నుండి బంగాళా దుంపల మూటల్ని కిందికి దించి, పేచీ పెట్టుకుని అర్ధరూపాయి సంపాదించుకున్నాడు. కనకవర్షంలో తడిసినంత సంబరంతో, సినిమా టాకీసు వైపు బయలుదేరాడు.

బస్టాండు పక్కనే వున్న సంత మైదానంలో దుకాణాలు బారులు తీరు తున్నాయి, పంక్తి భోజనాలకు చోటు వెతుక్కుంటున్న బంధుజనంలాగా! రోడ్లలో సంత రద్దీ అప్పుడప్పుడే ప్రారంభమౌతున్నది.

రాములుకు ఆకలి వేయసాగింది. తన వద్ద వున్న అర్ధ పైసలతో ఏదో ఒకటి కొనుక్కుతిని, ఆకలి చిచ్చును కొంత వరకు చల్లార్చుకోవచ్చు! కానీ, సినిమా మాటేమిటి? హోటలు ముందర చెత్తకుండీలో ఎంగిలాకుల్ని కెలుకుతూన్న కుక్కల్ని చూస్తూ నడుస్తున్న రాములుకు సినిమా బండి ఎదురుపడింది. చారల చొక్కావాడు సినిమాలోని హాస్య నటుల గొంతుకల్ని అనుకరిస్తూ, వాళ్ళ సంభాషణల్ని అప్పజెబుతున్నాడు. చిత్రాన్ని నేడే చూచి ఆనందించ మంటున్నాడు. ఇది వరకే చూచివుంటే మళ్ళీ చూడమంటున్నాడు. ఎన్నిసార్లు చూసినా తనివితీరని నవరస భరిత చిత్రం అంటున్నాడు.

షడ్రసోపేతమైన భోజనం అని పేరేగానీ, హోటల్‌లో అది దొరకవద్దా? అర్ధ రూపాయికే నవరసాలు దొరుకుతాయి సినిమాలో! ఈ ఒక్కపూట తిండి తినక పోయినంతమాత్రాన ప్రాణం పోతుందా? లక్ష్యంతప్పని బాణంలా నేరుగా సినిమా థియేటరు చేరుకున్నాడు రాములు.

చారల చొక్కావాడు సమీకరించి పంపిన ఆటవిక సైన్యంలా థియేటరును మోదేస్తున్నారు జనం. పాతికేళ్ళకు పూర్వం, అప్పటికి లభ్యమైన సామానులతో నిర్మింపబడిన థియేటరు అది. టిక్కెట్లు యిచ్చే గదుల్ని మాత్రం ఏడాది కిందట పడగొట్టించి, స్వయంగా దగ్గరుండి గట్టి కాంక్రీటుతో పునర్నిర్మించాడు థియేటర్ యజమాని.

పోరాటం అనేది జీవలక్షణం. పూర్వం అమృతం కోసం దేవదానవులు పోట్లాడు కున్నా రన్నది పురాణకథ. పోట్లాడుకున్నా, సంఘటిత శక్తితోనే వాళ్ళు ఆ పని చేశారు. అమృతం కోసం రాక్షసులంతా ఒక్కటై దేవతల్ని ఎదిరించారు. దేవతలూ అంతే! సినిమా టిక్కెట్టు కోసం ఎవడికి వాడు ఒంటరివాడై, తక్కిన వాళ్ళందరితోనూ పోట్లాడటం, నేడు మానవ లక్షణమైంది.

కష్టజీవిగా వారం రోజుల దాకా ప్రజాసేవ చెయ్యటానికి చాలినంత జీవశక్తిని పావుగంటలో ధారపోసినా, టిక్కెట్టు మాత్రం దొరకలేదు రాములుకు. హౌస్‌ఫుల్!

ఫస్ట్ క్లాసుకయితే, ఎక్కువ శ్రమ లేకుండా టిక్కెట్టు దొరికి వుండేదేమో? నిరాశతో మళ్ళీ బజారు వేపు నడిచాడు రాములు. ఫస్ట్‌క్లాస్ టిక్కెట్టయినా కొనేసి ఫస్ట్ షో చూడాల్సిందే!

రంగంపేటలో తిరుపతి బ్రహ్మోత్సవాలో, కాకపోతే పూరీ జగన్నాథ రథోత్సవమో ప్రారంభమైందనే అనుకోవాలి. రోడ్డు నిండా జనం. ఎంత జాగ్రత్తగా ఉమ్మేసినా, ఆ ఎంగిలి మనిషి మీద తప్ప మరో చోట పడదు. ఆగమని మొత్తుకున్నా ఆగే సంప్రదాయం లేని ఆర్.టి.సి. బస్సులు సైతం పెళ్ళినడక నడుస్తున్నాయి.

కాయకష్టం చేసుకోలేని ముష్టివాళ్ళు రోడ్డుకు యిరు వైపులా మకాం వేసి, తాము చెయ్యగలిగిన పని యిదొక్కటేనన్నట్లుగా గొంతు చించుకుంటున్నారు, కడుపు కోసం!

ఒళ్ళు వంచి పనిచెయ్యలేని సోమరి ఒకడు, తనను నమ్ముకున్న ఆడది నవమాసాలు మోసి కన్నబిడ్డను ముళ్ళ తీగలపైన పడుకోబెట్టి, గుడ్డ పరిచాడు, కడుపుకోసం!

అచ్చుపోసిన ఆబోతులాంటి వాడొకడు తన నగ్నవక్షం మీద, వీపుమీదా నెత్తురోడేలా కొరడాతో ఛెళ్ళు ఛెళ్ళున బాదుకుంటున్నాడు, కడుపుకోసం!

గడ పాతి గరిడీలు చేస్తున్న వాడొకడు; మామిడి టెంక పాతి మరికాసేపటికే మొక్క మొలిపిస్తానని మాయమాటలు చెబుతున్న వాడొకడు; చిలక, జోస్యం చెబుతుందంటూ చిల్లరకోసం చెయ్యిజాపుతున్న వాడొకడూ . . . అన్నిపాట్లూ కడుపుకోసమే!

రెక్కాడితేనేగానీ డొక్కాడని రాములు కడుపును బుజ్జగిస్తున్నాడు, సినిమా కోసం!

యుద్ధభూమిలో కూరుకుపోయిన కర్ణుడి రథంలా, సినిమా బండి సంతగేటు దగ్గర ఆగిపోయి, అక్కణ్ణుంచి మరి కదల్లేదు. పాటల హోరులో సంతగోల అణిగి పోయింది, మొరటోడి కౌగిట్లో మరదలు పిల్లలా! సంతకు వచ్చిన ఇంతులందరూ బండి వైపు చూచి ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

చారల చొక్కావాడు గొంతు మార్చి మార్చీ, పల్లెటూరి బావా మరదళ్ళ డైలాగులు చెబుతున్నాడు.

సినిమాలో హీరోయిన్ వాడిన చీరల రంగులూ, జాకెట్ల డిజైన్లూ, గాజుల రకాలూ, సెక్స్‌తార ధరించిన ఆభరణాల సొంపులూ కళ్ళకు కట్టినట్లుగా వర్ణించి, తనకు అలాంటివి తెచ్చిపెట్టమని ముద్దు ముద్దుగా బావను అడుగుతుంది మరదలు.

'అయితే సినిమాకు వెళ్ళి, అవి ఎలా ఉంటాయో చూసి, ఆ తరవాత అలాంటివి కొనుక్కువస్తా' నంటాడు బావ.

'పద మావా, నేనూ వస్తా' అంటుంది మరదలు.

'ఈ సినిమా నువ్వు చూశావుగదే, మళ్ళీ ఎందుకూ?'

'ఏదో ఉబలాటం కొద్దీ అడిగాను గానీ, అవన్నీ నువ్వు కొనగలవా ఏమిటీ? సినిమాలో చూస్తే చాల్లే! రూపాయితో ముచ్చట తీరిపోతుంది. ఎన్నిసార్లు చూస్తేనేం మావా? వందలౌతుందా? వేలౌతుందా?'

సరి సరి! అయితే తొందరగా తెములూ! మొదటి ఆట ఆరున్నరకు, రెండో ఆట పది గంటలకు! ఆలస్యమైతే టిక్కెట్లు దొరకవు..."

సాయంకాలం ఆరుగంటలయ్యేసరికి, మరో రూపాయి సంపాదించాడు రాములు. సినిమా థియేటరుకేసి నడుస్తూ, హొటలు ముందర ఆగాడు. ఆకలిగా ఉంది. ఏమైనా తింటే ప్రాణానికి హాయిగా ఉంటుంది. అయితే హొటల్ ముందరున్న సినిమాపోస్టర్ వాణ్ణి లోపలికి వెళ్ళనివ్వలేదు. చారల చొక్కావాడు చెప్పిన పల్లెటూరి బావ డైలాగు గుర్తుకొచ్చింది. 'తొందరగా తెములూ! మొదటి ఆట ఆరున్నరకు! ఆలస్యమైతే టిక్కెట్టు దొరకదు...'

రాములు ముందుకు నడిచాడు. పల్లెటూరి జనం, అడ్డు వచ్చిన వాళ్ళను మోచేతులతో పొడుచుకుంటూ సినిమాకు పరుగులు తీస్తున్నారు.

థియేటరు చేరుకున్న రాములుకు, తాను తలకిందులుగా తపస్సు చేసినా బెంచీ టిక్కెట్టు కొనలేనని అర్థమైపోయింది. ఈ వైపు నుంచి గానుగలో పెట్టిన చెరకు ఆ వైపు పిప్పిగా బయటపడిన చందాన, సెకండ్ క్లాస్ టిక్కెట్టుతో లోపలికి వెళ్ళిపోగలిగాడు.

రాములు సినిమా చూస్తున్నాడన్న మాటేగానీ, స్పర్శజ్ఞానం లేనివాణ్ణి రంభ ముద్దెట్టుకుంటున్నట్లుగా ఉంది వాడికి. ఆకలి వాడి పేగుల్ని నమిలేస్తోంది. టిక్కెట్టు కొనగా మిగిలిన అర్ధ పైసలతో కాకా హొటల్‌లో రెండు రొట్టెలు తినొచ్చు, సినిమా వదిలాక. ఆ రొట్టెల రుచిని ఊహించుకుంటూ వుండగానే, సినిమా పూర్వార్ధం ముగిసింది.

విరామ సమయంలో హాలులో నుంచి బయటకు వచ్చాడు రాములు. థియేటరు ఆవరణలోని చిరుతిండ్ల దుకాణం మీదికి ఎగబడ్డారు ప్రేక్షకులంతా, డాబా మీద ఆరబోసిన ధాన్యం చుట్టూ మూగే కాకుల దండులా! పొద్దస్తమానమూ ఊరూ వాడా తిరిగి వచ్చిన సినిమా బండి, గేటు లోపల కునుకు తీస్తోంది. రాములు గోడకు వీపు ఆనించి, గేటువైపు చూస్తూ నుంచున్నాడు. కళ్ళు బైర్లు కమ్ముతున్నట్లు అనిపిస్తోంది వాడికి.

ఒంటిమీద, అరవై ఏళ్ళ ముసలితనమూ అరిగిపోయిన పాత చీరా తప్ప మరేమీలేని ఒక వృద్ధురాలు కొద్దిగా వంగిన నడుముతో, చేత ఊతకర్రతో గేటుబయట నిలబడింది. పనివాడొకడు తాళం చెవి పట్టుకుపోయి గేటు తెరిచాడు. ముసలిది లోపలికి వచ్చింది. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చుట్టూరా ఒక సారి చూసి రాములు నుంచున్న వైపుకు నడిచి వచ్చింది. రంగంపేటలో తనను ఆకర్షించగలిగిన ఒకే ఒక వ్యక్తి తనకు దగ్గరలోనే ఉన్నాడని, అంతవరకూ గమనించలేదు రాములు. విద్యుద్దీప కాంతి సూటిగా పడలేని చోట, వెలుగూ చీకటీ ఒద్దికగా కాపురం చేసుకుంటున్న చోట, సిమెంటు బెంచీపైన కూర్చుని వున్నాడు, చారల చొక్కా వాడు. వృద్ధురాలు వాణ్ణి సమీపించగానే, "అమ్మా!" అన్నాడు వాడు.

"పోదాం, పదరా!" అన్నది ముసలావిడ.

"ఉండవే! ఇంకా డబ్బులివ్వలేదు"

చూడటానికి గుమాస్తాలా కనిపిస్తున్న వాడొకడు వాళ్ళ దగ్గరకు వచ్చి, "ఇదిగో మూడు రూపాయలు!" అంటూ, చారల చొక్కావాడి చేతిలో డబ్బు పెట్టాడు.

చారల చొక్కావాడు ఆ డబ్బు తడివి చూసుకుని, జేబులో వుంచుకుని పైకి లేచాడు. తల్లి భుజం మీద చెయ్యివేశాడు. ఆమె ముందుకు నడిచింది. ఆమె అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వాడు నడిచాడు. ఇద్దరూ బయటకు వెళ్ళిపోగానే, పనివాడు గేటు మూసి తాళం పెట్టాడు.

ఊబిలోపడ్డ గుండ్రాయిలా, రాములు సర్వేంద్రియాలూ దిగ్భ్రాంతిలో కూరుకుపోయాయి. కంటి పాప కూడా కాసేపు.కదలికను కోల్పోయింది. ఆకలి పేగుల్ని నులిమేస్తుంటే హరి హరీ మంటున్న కళ్ళు భ్రమిస్తున్నాయో, కలగంటున్నాయో, లేక సినిమా చూస్తున్నాయో అర్థం కాలేదు వాడికి. చిత్ర రథాన్ని అధిరోహించి, చారల చొక్కావాడు పర్యటిస్తున్నది అంధకార లోకంలోనా!

బెల్ మోగింది. జనమంతా మళ్ళీ హాల్ లో సర్దుకున్నారు. ఆ సందడిలో

స్థానాలు తారుమారయ్యాయి. బస్టాండులో పత్రిక అమ్మే బాలయ్య పక్కన రాములుకు సీటు దొరికింది.

తెరమీద స్లైడ్లు పడుతున్నాయి. స్లైడ్లు మానేసి సినిమా వెయ్యమంటూ ఈలలతో గోలెత్తి పోతున్నది హాలంతా!

స్లైడ్లు పూర్తయ్యేలోపల, రాములూ బాలయ్యల మధ్య ఈ క్రింది సంభాషణ జరిగింది.

"బండిలో కూర్చుని సినిమా కబుర్లు చెబుతాడే, అతణ్ణి తెలుసా నీకు?" అని అడిగాడు రాములు.

"ఎందుకు తెలియదూ?... అతని పేరు సుదర్శనం!"

"అతను గుడ్డివాడా?"

"నీకు తెలియదా?... కళ్ళు ఉన్నప్పుడు అతను నాటకాలు వేస్తూ వుండేవాడు. పాటలు కూడా చక్కగా పాడతాడు.

"కళ్ళెందుకు పోయాయి?"

"టైఫాయిడ్ వచ్చి, చూపు పోయింది. పాపం, ఇప్పుడు ఏ పనీ చెయ్యలేడు. బండిలో తిరిగివచ్చిన రోజున సినిమా వాళ్ళు రెండో మూడో యిస్తారు. అదే అతని సంపాదన!"

రాములు కళ్ళు తెరమీద ఉన్నాయి కానీ, వాడు సినిమా చూడటం లేదు. వాడి ఆలోచనలన్నీ గుడ్డివాడివెంట నీడలైనాయి.

ఆ గుడ్డివాడికీ, తనకూ ఎంత వ్యత్యాసం!

వాడు కుడి, తాను ఎడమ!

వాడికి కళ్ళు లేవు; తనకు కళ్ళున్నాయి.

వాడు సినిమా చూడలేడు; తాను చూడగలడు.

కడుపు నింపుకోవడానికి చిలవలు పలవలుగా సినిమాను వర్ణించి చాటింపు వేశాడు వాడు; సినిమా చూడటానికి ఒళ్ళు గుల్ల చేసుకుని కడుపు మాడ్చుకున్నాడు తాను.

దృష్టి లేనివాడు దృశ్యాల్ని కళ్ళకు కట్టినట్లు మాటల కుంచెలతో చిత్రించటమన్నది ఎంత విడ్డూరమైన విషయం! తన కళ్ళతో చూడలేని చిత్రంలోని అందాలన్నీ వాడికి ఎలా కరతలామలకమయ్యాయి?

తలపులను తెరవైపు సారించాడు రాములు. గుడ్డివాడు చెప్పిన సొగసులన్నీ వున్నాయి తెరమీద. నీలాకాశపు గొడుగు కింద, పచ్చని పచ్చిక తివాసీ మీద కొండవాగులా పరుగులు తీస్తూ యుగళ గీతం పాడుతున్నారు, నాయకీ నాయకులు. కంటిపాపల్లో కదులుతున్న ఈ దృశ్యం, కళ్ళు మూసుకుంటే ఏమౌతుంది ?

' నేనిప్పుడు గుడ్డివాణ్ణి!' అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు రాములు. ఏముంది చూడటానికి ? ప్రపంచం - మిథ్య! జీవితం - మిథ్య! ఉన్నది అనుకుంటున్నది, ఏదీ లేదు! తానూ - చీకటే ! ఇంతకుతప్ప సృష్టిలో మరేదీ లేదు!

శ్రావ్యంగా వినబడుతున్నది పాట. పాటను పెనవేసుకొన్న సంగీత స్వనాలు చీకటిలో నిద్రపోతున్న రంగు రంగుల ఊహల ధూళిని కుదుపుతున్నాయి.

అందాల తార అంగాంగ సౌందర్యకోణాలన్నీ దేనికదే విడివిడిగా చీకటి ముసుగులోంచి తొంగి చూచి, అంతలోనే అదృశ్యమౌతున్నాయి.

నానావర్ణ శోభిత ప్రకృతి సౌందర్యంలోని ఒక్కో భాగమే చీకట్లో నుంచి వచ్చి స్లైడులాగా క్షణ కాలం నిలిచి మళ్ళీ చీకట్లోకి నిష్క్రమిస్తున్నది.

రాములు కళ్ళ మూతల వెనుక చీకటి కాన్వాసుపైన నలుపు, ఊదా, నీలం, ఆకుపచ్చ, పసుపు, ఎరుపూ, తెలుపూ విడి విడిగానూ, కలగలుపుగానూ, ఒకటి రెండై, రెండు నాలుగై, నాలుగు పదహారై, అన్నిటికీ అన్నిరెట్లై, తెరలు తెరలుగా చారలు చారలుగా వలయాలు వలయాలుగా పోగులు పోగులుగా జల్లుజల్లుగా మచ్చలు మచ్చలుగా లేత లేతగా ముదురు ముదురుగా చెదురు మదురుగా, కొత్త కొత్తగా, వింత వింతగా, ఎన్నో, ఎన్నెన్నో రంగులు !

పాపం, చారల చొక్కా వాడికి ఏమున్నది బ్రతుకులో ఈ రంగు రంగుల చీకటి తప్ప !

• ఆంధ్రపత్రిక సిద్ధార్థినామ సంవత్సరాది సంచిక 1979 - 80 •